క్లుప్తంగా

పౌష్టికాహారం పంపిణీ



ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్: ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణులు, బాలింతలతోపాటు సహాయకులకు శనివారం ఆదరణ వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో రొట్టె, గుడ్లు పంపిణీ పంపిణీ చేశారు. అదే విధంగా ఆదరణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దాతలు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆదరణ ఆశ్రమ నిర్వాహకులు జాన్ ప్రభాకర్, సంస్థ సభ్యులు నిహాల్, నవనీత్‌లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ ఈశ్వరయ్య

కోవెలకుంట్ల: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. మృగశిరకార్తెను పురస్కరించుకుని ఉబ్బసం, ఆయాసం, దగ్గు, తదితర జబ్బులతో బాధపడుతున్న 40 మందికి ఆయుర్వేద డాక్టర్ ఈశ్వరయ్య వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షులు బాలాంజనేయ రెడ్డి, మహేశ్వరరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

కుందూనదికి జలకళ



కోవెలకుంట్ల సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

కోవెలకుంట్ల : నైరుతి రుతుపవనాల ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పట్టణ శివారులో ప్రవహిస్తున్న కుందూనదికి జలకళ సంతరించుకుంది. సబ్ డివిజన్‌తో పాటు నది ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురియడంతో వాగులు, వంకలు, పొలాల్లోని నీరు కుందూలో చేరడంతో నదికి వరదనీరు పోటెత్తింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కుందూ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీతీర గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వరి, పత్తి, మిరప తదితర పంటల సాగుకు ముందే పుష్కలంగా సాగునీరు అందుబాటులో ఉండటంతో ఊరట చెందుతున్నారు.

ఆకుమల్ల సహకార సంఘం చైర్మన్ రాజీనామా

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల సహకార సంఘం చైర్మన్ గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. శనివారం ఆయన రాజీనమా పత్రాన్ని సహకార సంఘం సీఈఓ చంద్ర శేఖర్ రెడ్డికి అందజేశారు. సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ఓటమి నేపథ్యంలో స్వచ్ఛందంగా పదవికి రాజీనమా చేసినట్లు ఆయన తెలిపారు.

సొసైటీ అధ్యక్ష పదవికి మురళీ మోహన్‌రెడ్డి రాజీనామా

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పీఆర్ మురళీమోహన్‌రెడ్డి తన పదవికి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని వ్యాట్సాప్ ద్వారా జిల్లా ప్రాథమిక సహకార సంఘాల అధికారి వెంకటసుబ్బయ్యకు పంపినట్లు తెలిపారు. తన పదవీ కాలంలో సహకార సంఘం అభివృద్ధికి సహకారం అందించిన రైతులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



సంతాపం తెలుపుతున్న ఎంపీపీ బుగ్గన, నాయకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్ పుల్లయ్య(84) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్‌రెడ్డి తదితరులు భాస్కర్ పుల్లయ్య మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు వెంకిరెడ్డి, చలపతి రెడ్డి పరమేశ్వర్‌రెడ్డి, హేమనాథ్‌రెడ్డి, రామిరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు ‘చిటుకు’ ముప్పు!

- తొలకరిలో సన్నజీవాలకు ముందస్తు టీకాలు వేయించడం అత్యుత్తమం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణ నష్టం



చిటుక వ్యాధి నివారణకు గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారిని (ఫైల్)

డోన్ : సీజనల్ వ్యాధుల్లో ప్రాణాంతమైనది చిటుకు వ్యాధి. ప్రతి ఏటా తొలకరిలో సన్నజీవాల ప్రాణాలకే చిటుకు వ్యాధి ముప్పు. పచ్చికను అతిగా మేయడం వల్ల ఏడాదిలోపు గొర్రెపిల్లలకు చిటుకు వ్యాధి ప్రాణాంతకంగా మారుతుంది. దీంతో ఏటా వేలాది గొర్రెలు, మేకలు, పొట్టేళ్ల మృతి చెందుతూనే ఉన్నాయి. సరైన సమయానికి టీకాలు వేయించకపోవడంతో పెంపకందారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. క్లాస్ట్రీడియం పర్‌ఫ్రిమిన్ జెన్స అనే సూక్ష్మజీవి మేత ద్వారా జీవాల శరీరంలోకి చేరుతుంది. మూగ జీవాల శరీరంలో అంతర్ పరాన్నజీవులు ఎక్కువగా ఉన్నందువల్ల ఈ వ్యాధి త్వరగా ముదిరి ప్రాణాంతకరంగా మారుతుంది. చిటికె వేసేలోపు మూగజీవాలు ఈ వ్యాధి భారిన పడి ప్రాణాలు పోతున్నాయనే బాధతో పూర్వీకులు చిటుకు వ్యాధి అనే పిలిచారు.

లక్షణాలు :

- రాత్రి బాగుండి, తెల్లారేసరికల్లా ఎక్కువగా జీవాలు మరణించడం కనిపిస్తుంది.
- జీవాల కళ్ల ముందటే లక్షణాలు కనిపించకుండానే హఠాత్తుగా గాలిలో ఎగిరి కిందపడి మృతి చెందుతాయి.
- జ్వరం, పళ్లు కొరకడం, వనకడం, బిగుసుకుపోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, చెట్లకు గట్టిగా తలను ఆనించి ఉండటం, కాళ్లు బిగించి నడవడం, శ్వాస కష్టమవడం తదితర లక్షణాలు చిటుకు వ్యాధి ప్రారంభ దశలో కనిపిస్తాయి.
- వ్యాధి తీవ్రత దశలో అధిక వీరేచనాలు, మందకొడిగా ఉండటం, మేత సరిగ్గా తినకపోవడం జరుగుతోంది.

చికిత్స..

- సాధారణంగా ఈ వ్యాధికి చికిత్స చేసే వ్యవధి ఉండదు.
- ప్రాథమిక పశువైద్యాధికారిని సంప్రదించి ప్రతి తొలకరిలోనూ టీకాలు వేయించుకోవడం ఉత్తమం.
- వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత పశువైద్యాధికారులను సంప్రదించాలి.

నివారణ

- ప్రతి ఏటా మే, జూన్ మాసంలో చిటుకు రోగం నివారణకు మూగజీవాలకు టీకాలు వేయించాలి.
- బూస్టర్ డోస్ 15 రోజుల తర్వాత తప్పనిసరిగా వేయించాలి.
- తొలకరిలో జీవాలు కడుపునిండా మేత మేయకుండా యజమానులు జాగ్రత్త పడాలి.
- గొర్రె పిల్లలకు అత్యధికంగా తల్లిపాలు తాగకుండా చూడాలి.
- పాలుతాగే స్థితి నుంచి ఒకేసారి దాణాకు మార్చకుండా క్రమక్రమంగా అలవర్చాలి.
- తొలకరిలో వర్షాలకు మొలిచి వాడిపోయిన లేత గడ్డిని జీవాలు తినకుండా చూసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి



తొలకరి సీజన్‌లో మూగ జీవాలైన గొర్రె, మేక, పొట్టేళ్ల పోషకులు అప్రమత్తంగా ఉండాలి. ముందస్తుగా తొలకరి ఆరంభంలోనే మేక, గొర్రె పిల్లలకు బూస్టర్ డోస్ టీకాలు వేయించాలి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా పోషకులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అత్యంత ప్రమాదకరమైన చిటుకు వ్యాధి నివారణకు ముందస్తు నివారణే అత్యుత్తమ మార్గం.

– డాక్టర్ నాగరాజు, సహాయ సంచాలకులు, పశుసంవర్ధక శాఖ, డోన్.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, ఆర్మీ బలగాలు

బనగానపల్లె రూరల్: గ్రామాల్లో గొడవలు సృష్టించినా, పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. శనివారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన రోడ్లలో పోలీసులు, ఆర్మీ బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాలు, పట్టణాల్లో అలజడులు సృష్టించేందుకు పాల్పడితే ఉపేక్షించమన్నారు. ఎన్నికల ఘట్టం ముగిసిందని, ఇంకా వాటిని దృష్టిలో ఉంచుకుని పగలు, ప్రతీకారాలు మంచివి కాదని సూచించారు. రాజకీయాల్లో గెలుపోటములు సర్వసాధారణమని, గెలుపు లేదా ఓటమి చెందిన పార్టీల కార్యకర్తలు, నాయకులు రెచ్చగొట్టుకునే విధంగా వ్యవహరించరాదని సూచించారు. ఇప్పటికైనా ప్రతిఒక్కరూ పోలీసుల చర్యలు తెలుసుకుని మసలుకోవాలని, లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామిరెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా మైదానం జలమయం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల లోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానం జలమయం అయ్యింది. మీర్జాపురం రోడ్డు వైపు మైదానం వాలుగా ఉండడంతో నీరు నిలిచిపోతుంది. వర్షాలు కురిసే సమయంలో గతంలో ప్రహారీకి అక్కడక్కడ రంధ్రాలు చేయడంతో వర్షపునీరు బయటకు పోతుండేవి. ప్రస్తుతం మైదానం కుంటను తలపిస్తుంది.

కమనీయం.. మహానందీశుడి కల్యాణం



మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర దంపతులకు శనివారం కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, హనుమంతశర్మ, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, అర్చకులు స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగల్య ధారణ, అక్షతల సమర్పణ పూజలు కనుల పండువగా సాగాయి. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవల్లో పాల్గొని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నామన్నారు. పనులు పూర్తి కాగానే యథావిధిగా విద్యుత్ సరఫరా చేస్తామని ఆయన చెప్పారు.

కరాటే పోటీల్లో గ్రేడింగ్

డోన్ : సికోకై కరాటే ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం ఎగ్జామినర్ వై చంద్రశేఖర్ పర్యవేక్షణలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ నిర్వహించారు. ఎల్లో బెల్టులో జాహ్నవి, అర్షిత్, రేవంత్, రాహుల్, అస్రఫ్, మసూర్, నవాజ్, కీర్తన, అనికేత్, ఆరంజ్ బెల్టులో సుజిత్, మనోజ్ఞ, నిహారిక, లాస్య, సిరి చందన, భాను ప్రకాష్, జయదీక్షిత్, గ్రీన్ బెల్టులో అసిఫా, సభా, కౌసర్, పర్పుల్ బెల్టులో తరుణ్, హిమతేజ్, అభిరాం, నవదీప్, బ్రౌన్ బెల్టులో హేమంత్ విజయం సాధించారని కరాటే మాస్టర్ రమణ తెలిపారు.

సహకార సంఘం సభ్యులు వివరాలు అందజేయాలి

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల ప్రాథమిక సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న రైతులు తమ వివరాలను సొసైటీలో అందజేయాలని ముఖ్య కార్యనిర్వహణాధికారి కేశవర్ధన్ శనివారం తెలిపారు. సొసైటీలోని సభ్యుల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని, ఆధార్, పాన్‌కార్డు, పాస్ ఫొటోలు, మొబైల్ నంబర్ వివరాలు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 9966986297 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సంజామలలో మోస్తరు వర్షం

సంజామల: మండల కేంద్రం సంజామలతో పాటు గ్రామాలలో శనివారం మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి మొబ్బులు కమ్ముకుని సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఉరుములు,మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ముక్కమల్ల చెరువు కళకళలాడుతుంది. గ్రామాలలో వంకలు వాగులు పారుతున్నాయి.

కొలిమిగుండ్ల: మండలంలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి వాతావరణంలో పూర్తిగా మారిపోయి ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. ఈనెలలో సాధారణ వర్షపాతం 68.4 మి.మీ కాగా ఇప్పటి వరకు 119.8 మి.మీ వర్షపాతం నమోదు కావడం విశేషం. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయి.

విధులు సక్రమంగా నిర్వర్తించండి

రుద్రవరం: అటవీ సంరక్షణలో భాగంగా విధులు సక్రమంగా నిర్వర్తించాలని రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు ప్రొటెక్షన్ వాచర్లకు సూచించారు. స్థానిక అటవీ కార్యాలయంలో శనివారం ఆయన రేంజి పరిధిలోని చీతల్, ఊట్ల, నిచ్చెన్లబావి బేస్ క్యాంప్‌లతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన నాగంబావి బేస్ క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు ప్రత్యేకంగా సెల్ ఫోన్‌లలో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని అడవి ట్రాక్‌లో తిరుగుతూ అటవీ సంరక్షణకు అప్రమత్తంగా ఉంచాలని చెప్పారు. వేతనాలు తీసుకునేందుకు బ్యాంకు ఖాతాల నంబర్లు అందజేయాలని తెలిపారు. రుద్రవరం సెక్షన్ అధికారి నాగరాజు ఉన్నారు.

ఆలయాల్లో ఆరుద్రోత్సవ పూజలు

మహానంది: మహానంది, ఓంకారం ఆలయాల్లో శనివారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహానందీశ్వరస్వామి, ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా చేపట్టారు. పలు ప్రాంతాల భక్తులు వేలాది సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివార్లను దర్శించుకుని అభిషేకం, అర్చన పూజలు నిర్వహించుకున్నారు. శనివారం వీకెండ్ కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణాలు భక్తులతో కళకళలాడాయి.

మహానందీశ్వరుడి సన్నిధిలో డీఆర్‌ఓ



మహానందికి వచ్చిన డీఆర్‌ఓ మధుసూదన్‌రావు దంపతులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు దంపతులు శనివారం రాత్రి పూజలు నిర్వహించుకున్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

అమ్మ ‘జ్ఞాపకం’ ధ్యాన కేంద్రం!

- తల్లి గుర్తుగా పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని నిర్మించిన తనయుడు
- ఏకంగా ఎకర విస్తీర్ణంలో నందన వనం ఏర్పాటు చేసిన వైనం
- తానతోపాటు పలువురికి ప్రశాంతత చేకూర్చుతున్న భువనేశ్వరరాజు



వీరబ్రహ్మేంద్ర స్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం ముఖ ద్వారం



పచ్చని పూల చెట్ల మధ్య గౌతమ బుద్ధుడు విగ్రహం

బేతంచెర్ల : అమ్మ జ్ఞాపకాలు ఓ అనుభూతి... ఒక్కొక్కరూ ఓ విధంగా ఆస్వాదిస్తుంటారు. ఏటేటా కొందరు దానధర్మాలు చేస్తుంటే... మరికొందరు విగ్రహాలు తయారు చేయించి ప్రేమను చాటుకుంటుంటారు. అయితే బేతంచెర్ల పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త భువనేశ్వర రాజు ప్రతిరోజూ తనతల్లి ఒడిలోనే జీవనం సాగించాలనుకున్నాడు. తన తల్లి జ్ఞాపకార్థం ఏకంగా ఎకర విస్తీర్ణంలో ‘వీరబ్రహ్మేంద్ర స్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం’ నిర్మించి తన మమకారాన్ని చాటుకున్నాడు. పాములపాడు మండలం, భానుముక్కల గ్రామానికి చెందిన భువనేశ్వర రాజు 25 ఏళ్ల కిందట బేతంచెర్లలో స్థిరపడ్డాడు. 2009లో తన తల్లి వెంకటరమణమ్మ మరణించగా ఆమె జ్ఞాపకార్థం నిర్మాణం చేపట్టిన ధ్యానకేంద్రాన్ని 2012లో ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ధ్యానం చేసుకునేందుకు ప్రశాతం వాతావరణాన్ని రూపొందించాడు. అదేవిధంగా ధ్యానానికి సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచాడు. తనేకాదు ప్రతిఒక్కరూ మనశ్శాంతిగా గడిపేలా సుందరంగా నిర్మించారు. పచ్చని మొక్కలు... పూల చెట్లతో పచ్చగా కళకళాడుతుందీ కేంద్రం. ఏకంగా ఓ వనాన్ని సృష్టించాడు. ధ్యాన కేంద్రంలోకి ప్రవేశిస్తేచాలు మనకు తెలియకుండానే ప్రశాంతత చేకూరుతుంది. సమస్యలన్నీ మటుమాయం కావల్సిందే. గౌతమ బుద్ధుడు, వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాలను ఏర్పాటు చేయించారు. ప్రత్యేకించి శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతాబోధ శిల్పాలు ఆకట్టుకుంటాయి. మనకే గీతోపదేశం చేస్తున్నట్లుగా ఉంటుందా దృశ్యం.


ధ్యాన కేంద్రాన్ని సందర్శించిన బ్రహ్మర్షి సుభాస్ పత్రిజీ

వీరబ్రహ్మేంద్ర స్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రశాంతతకు నిలయంగా మారింది. ప్రజలు మానసిక ప్రశాంతతకు ఈ కేంద్రాన్ని ఆశ్రయిస్తుంటారు. ప్రతిరోజు కొందరికి నిత్యప్రక్రియగా మారింది. పౌర్ణమి తదితర ప్రత్యేక సందర్భాల్లో వంద మంది వరకు ధ్యానం చేసేందుకు వస్తుంటారు. బ్రహ్మర్షి సుభాస్ పత్రిజీ ఈ ధ్యాన కేంద్రాన్ని సందర్శించి భువనేశ్వరరాజు అభినందించారు కూడా.

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత



ధ్యానంతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఆరోగ్యం మెరుగు పడుతుంది. చింతలు వీడి ధ్యానం అవలంభిస్తే... అంతా మంచే జరుగుతుందనేది నా నమ్మకం. పదిమందికి ధ్యానంతో పాటు మానసిక ప్రశాంతతను కల్పించాలనే సదుద్దేశంతో నా తల్లి జ్ఞాపకార్థం అవతార పురుషుడైన వీరబ్రహ్మేంద్ర స్వామి పేరు మీదుగా ఈ పిరమిడ్ ధ్యాన కేంద్రం ఏర్పాటు చేశా. – భువనేశ్వరరాజు, పిరమిడ్ కేంద్ర నిర్వహకులు



ధ్యాన కేంద్రాన్ని సందర్శించిన పత్రిజీ (ఫైల్)



వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహం



అర్జునునికి గీతా భోదన చేస్తున్న శ్రీకృష్ణుడు

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి

దొర్నిపాడు: మూడేళ్లు నిండిన చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ సూచించారు. శనివారం స్థానిక అంగన్‌వాడీ బాటలో భాగంగా చిన్నారులు, తల్లులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు మంచి పౌష్టికాహారం లభించడంతో పాటు ఆట పాటలతో కూడిన విద్యను బోధిస్తారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త సుబ్బమ్మ పాల్గొన్నారు.

చాగలమర్రి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు ఆట పాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తామని, మూడేళ్లు నిండిన మీ పిల్లలను వెంటనే అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సిబ్బంది గ్రామాల్లో, వార్డుల్లో ర్యాలీలు నిర్వహిస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. శనివారం స్థానిక 17వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త చంద్రకళ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి 16వ వార్డులో ర్యాలీ నిర్వహించారు. బడిబాట కార్యక్రమం ఈ నెల 12వ తేదీ వరకు నిర్వహించాల్సిందిగా అధికారులు సూచించారు. సహాయ కార్యకర్త సుజాత, ఆశ కార్యకర్త శివలక్ష్మీ పాల్గొన్నారు.

భూముల వేలాలు వాయిదా

మహానంది: బండిఆత్మకూరులోని శ్రీ లక్ష్మీ, జనార్దన, ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆలయ భూములకు నిర్వహించాల్సిన వేలాలు వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ నాగప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 10న భోజనం, నారాయణపురం, పార్నపల్లె గ్రామాల్లో జరగాల్సిన వేలాలు సైతం వాయిదా వేశామన్నారు. ఇదిలా ఉండగా వేలాల నిర్వహణకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని, అందువల్లే వేలాలు వాయిదా వేసినట్లు మండల రైతులు చర్చించుకున్నారు.

మహానంది దేవస్థానానికి ఏసీ విరాళం



ఏసీ విరాళం అందించిన దాతలతో ఈఓ, పండితులు

మహానంది: మహానంది దేవస్థానానికి కడప నగరానికి చెందిన ఎన్ఆర్ఐ సునీల్, వెంకటలక్ష్మమ్మ, జయంత్, దినేష్‌కుమార్‌లు సుమారు రూ. 50వేల విలువైన ఎయిర్ కండీషనర్‌ను విరాళంగా అందించారు. శనివారం వారు దేవస్థానానికి చేరుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డికి వాటిని అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ముఖ్య అర్చకులు రాజమాణిక్యశర్మలు దాతలను అభినందించారు.

ఆకలి తీర్చడం ఎంతో పుణ్యఫలం

మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తుల ఆకలి తీర్చడం ఎంతో పుణ్యఫలమని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణ కార్యక్రమానికి అబ్బీపురం గ్రామానికి చెందిన శవ్వా శరభారెడ్డి, శవ్వా మనోహర్‌రెడ్డి సోదరులు శనివారం పది టిక్కీల బియ్యం విరాళంగా అందించారు. ఈ మేరకు శవ్వా శరభారెడ్డి, సర్పంచ్ శ్రీలక్ష్మీ దంపతులను ఈఓ సన్మానించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

మద్యం, నాటు సారా ధ్వంసం



నాటుసారా, మద్యంను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలో పట్టుబడిన నాటుసారా, అక్రమ మద్యం బాటిళ్లను శనివారం పోలీసులు ట్రాక్టర్‌తో ధ్వంసం చేయించారు. 1,020 లీటర్ల నాటుసారా, వివిధ రకాల మద్యం బాటిల్లను ధ్వంసం చేశామని సీఐ ప్రియతం రెడ్డి, ఎస్ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. మద్యం, నాటుసారా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు.

11న నామస్మరణం పుస్తకావిష్కరణ

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామానికి చెందిన కవి రామాచార్యులు రచించిన ‘నామస్మరణం– మోక్షదాయకం’ పుస్తకాన్ని 11వ తేదీన ఆవిష్కరించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆయ్యప్పస్వామి దేవాలయంలో ప్రవచనకర్తలు రామశేషయ్య, నారాయణరెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.